నిబంధనలు ఖైమా!

- మాంసం విక్రయాల్లో ప్రమాణాలు పాటించని వ్యాపారులు
- కల్తీ మాంసం అంటగడుతూ తూకాల్లో మోసగిస్తున్న వైనం
- పశువైద్యాధికారుల సర్టిఫై లేకుండానే జీవాల వధ



పట్టణంలో పశువైద్యాధికారుల ధ్రువీకరణ లేకుండానే విక్రయిస్తున్న మాంసం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ముక్క లేనిదే ముద్ద దిగని మాంసం ప్రియుల సంఖ్య భారీగానే ఉంది. ఇక ఆదివారం, మంగళవారోస్తే మాంసం వినియోగం గణనీయంగానే ఉంటుందనేది తెలిసిందే. అయితే తాము కొనుగోలు చేస్తున్న మాంసం నాణ్యమైనదేనా కాదా అని గుర్తించలేని వారు చాలా మందే ఉన్నారు. తాము కొనేది పొట్టేలు మాంసమా కాదా అని గుర్తించలేని పరిస్థితి. ఇలాంటి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు నిబంధలను ఖైమా కొడుతూ తగిన ప్రమాణాలు పాటించ కుండా నాణ్యతలేని మాంసాన్ని అంటగడుతున్నారు.

కొన్నింటికే అనుమతి..

పట్టణంలో మున్సిపల్ లైసెన్స్ పొందిన పొట్టేలు మాంసం దుకాణాలు 18 ఉండగా, అనుమతి లేనివి 50కి పైగానే ఉన్నాయి. దుకాణాల్లో సాధారణ రోజుల్లో 2 క్వింటాళ్ల నుంచి 5 క్వింటాళ్ల వరకు మాంసం విక్రయిస్తారు. అదే ఆది, మంగళ వారాల్లో అయితే 15 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్ల వరకు విక్రయాలు ఉంటాయి. కిలో పొట్టేలు మాంసం రూ.740ల నుంచి రూ.800ల వరకు వ్యాపారులు అమ్ముతున్నారు.

పశువైద్యాధికారి ధ్రువీకరణ లేకుండానే..

నిబంధనల ప్రకారం పశు వైద్యాధికారుల పరిశీలన చేసి వారు ఆరోగ్యకరమైన పొట్టేలు అని ధ్రువీకరించిన తరువాతే పొట్టేళ్లు కోయాలి. శుభ్రం చేసిన తరువాత కూడా వైద్యులు మరోసారి మాంసం క్షుణ్ణంగా పరీక్షించి మాంసం సురక్షితమైందని ముద్రవేసిన అనంతరమే దుకాణాల్లో పెట్టి విక్రయాలు జరపాలి. మాంసం విక్రయాలకు ఉంచినప్పుడు దుమ్మూ, ధూళి, ఈగలు, దోమలు వాలకుండా వాటిపై తెర కప్పి ఉంచాల్సిఉంది. అయితే పట్టణంలో ఈప్రక్రియ కొనసాగడం లేదు. కబేళా ఉన్నా అందులో వ్యాపారులు పశువైద్యాధికారుల నిర్ధారణ చేయకుండానే కోస్తుండగా.. మరికొందరు తమ ఇళ్ల వద్ద, ఇతర ప్రాంతాల్లో కోసి బహిరంగ మార్కెట్‌లో పెట్టి మాంసం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కొందరు వ్యాపారులు పోట్లేళ్లకు బదులుగా గొర్రెలు, మేకపోతులను కోసి పొట్టేళ్ల మాంసం అని విక్రయిస్తూ కల్తీ మాంసాన్ని మాంసం ప్రియులకు అంటగడుతున్నారు. తూకాల్లో మోసాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా చౌకధరకు హోటళ్లు, ధాబాలకు అధికంగా సరఫరా చేస్తున్నారు. ఒక్కోసారి కొందరు వ్యాపారులు మిగిలిన మాంసాన్ని ఫ్రిజ్‌లలో ఉంచి మరుసటి రోజు అమ్మకొని సొమ్ముచేసుకుంటున్నారు. ఇది ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపుతోంది. ఇదిలా ఉండగా పశువైద్యాధికారులు మాంసం కోసేందుకు పొట్టేళ్లను సర్టిఫై చేసేందుకు నెలనెలా పశువైద్య శాఖకు సర్‌చార్జ్ చెల్లించాలి. అయితే మున్సిపాలిటీ ఎలాంటి డబ్బు చెల్లించకపోతుండటంతో పశు వైద్యులు కమేళాలకు వెళ్లడం లేదని వైద్యాధికారులే పేర్కొంటున్నారు.

పరిశుభ్రత పాటిస్తే ఒట్టు

జీవాలు వధించే ప్రాంతం అపరిశుభ్రంగా ఉండటమే కాకుండా బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు చేస్తుండటంతో దుమ్మూధూళిలో మాంసం విక్రయిస్తున్నారు. దీనిని వినియోగించిన వారు అనారోగ్యాల బారిన పడే అవకాశం వుంది. మాంసం కోసేందుకు ఉపయోగించే కత్తులు, చాకులు ఇతర పాత్రలను కూడా రోజు వేడినీటితో కడగాల్సి ఉంది. నిత్యం శుభ్రంగా వుంచుకోవడంతో పాటు డిస్ఇన్‌ఫెక్ట్ చేయాలన్న నిబంధన ఉంది. దుకాణాల ప్రాంగణంలో ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ క్రమం తప్పకుండా చల్లాలి. వ్యాపారులకు కూడా చర్మవ్యాధులు ఉండకూడదు. గోర్లు పెంచుకోకూడదు. మాంసం విక్రయాలకు సంబంధించి పొట్టేళ్ల కోసే సమయంలో పశువైద్యులను మున్సిపల్ అధికారులే ఇవన్నీ పరిశీలించాలి. అయితే ఇవేవీ అమలు కావడంలేదు. అన్నీ తెలిసిన అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

తాజా మాంసాన్ని ఇలా గుర్తించాలి..

పొట్టేలు మాంసం తాజాదైతే లేత తెలుపు, లేత పింక్ కలర్‌లోను ఉంటుంది. కల్తీ, నిల్వ వుంచిన, చెడిపోయిన మాంసం ముదురు ఎరుపు రంగులో ఉంటుందని పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఆ మేరకు మాంసం ప్రియులు కొనుగోలు చేయాలని వారు సూచిస్తున్నారు.

మాంసం వ్యాపారులు నిబంధనలు పాటించాలి



మాంసం వ్యాపారం చేసే వ్యాపారులు మొదట ట్రేడ్‌లైసెన్స్‌లు తీసుకొని నిబంధనల మేరకు వ్యాపారం చేయాలి. ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకొని కల్తీ లేకుండా పొట్టేళ్ల మాంసాన్ని విక్రయించాలి. పశువైద్యాధికారుల పర్యవేక్షణలో పొట్టేళ్లను కోసేలా తగిన చర్యలు తీసుకొంటాం. వారు సర్టిఫై చేసిన మాంసాన్నే విక్రయించాలి. దుకాణాల వద్ద శుభ్రత పాటించాలి. ప్లాస్టిక్ కవర్ల వినియోగించకూడదు. నిబంధనలు పాటించని వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు.

రైతులకు విద్యుత్ సరఫరాలో మార్పు

కోసిగి: జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యవసాయానికి రైతులకు అందించే విద్యుత్ సరఫరాలో బుధవారం నుంచి 30 రోజుల పాటు మార్పులు ఉంటాయని కోసిగి ట్రాన్స్ కో ఏఈ వీరేష్ మంగళవారం తెలిపారు. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు 132కేవీ విద్యుత్ లైన్ కండెక్టర్‌ను మార్చుతున్న కారణంగా రైతులకు ఇచ్చే 3ఫేజ్ విద్యుత్‌ను ఉదయం 6 గంటలు, రాత్రి 3గంటలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 30 రోజుల తర్వాత రైతుల అభిప్రాయం మేరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

పెద్దకడబూరు : నెల రోజుల పాటు విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 6 నుంచి 30రోజుల పాటు రైతులకు ఇచ్చే 3ఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రతిరోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరిగి రాత్రి 12 నుంచి తెల్లవారుజామున 3గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: 75 శాతం కళాశాల ఫీజు చెల్లించకుంటే పరీక్ష ఫీజులను కట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు వుందని యాజమాన్యాలు విద్యార్థులను వేధించడం తగదన్నారు. ఈ మేరకు తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



సోమప్ప సర్కిల్ వద్ద డ్రైన్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. సర్కిల్ వద్ద ప్రధాన రహదారి పక్కన దుకాణ సముదాయాల ముందు కూలిపోయిన డ్రైనేజీ పైప్పు నిర్మాణ పనులను పరిశీలించి ఆయా పనులపై పలు సిబ్బందికి సూచనలిచ్చారు. అంతకు మునుపు పారిశుధ్య పనులను పరిశీలించి ఆయా పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని సూచించారు.

ఏపీ టెట్‌లో 146.89 మార్కులు



ముకుంద సువర్ణ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాెం లో నివాసం ఉంటున్న ముకుంద కృష్ణమూర్తి, ఈరమ్మ దంపతుల కుమార్తె ముకుంద సువర్ణ ఏపీ టెట్ ఫలితాల్లో ఎస్జీటీలో 150 మార్కులకు 146.89 మార్కులు సాధించారు. ఈమె గత టెట్‌లలో ఒకసారి 142 మార్కులు, మరోసారి 136 మార్కులు సాధించారు. రెండేళ్ల క్రితం కోసిగిలోనే మేనత్త కుమారుడు రామాంజితో పెద్దలు వివాహం జరిపించారు. అక్టోబర్‌లో నిర్వహించిన టెట్ పరీక్షకు రెండు నెలల కుమారుడితో కలిసి వెళ్లి పరీక్ష రాసింది.

ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు అధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలని అప్పుడే ఐటీ ఇంజినీరింగ్ రంగంలో రాణిస్తారని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వీరన్న అన్నారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు పి.ఇమ్రాన్‌ఖాన్, మహబుబ్ బాషా, అహమ్మద్‌బాషాలు డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో రచించిన ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ ఆర్కిటెక్చర్ అప్లికేషన్, మైక్రోవేవ్ ఇంజినీరింగ్‌పై పుస్తకాలను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఆయా అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



నాగేష్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల నాయకుడు గొర్లి నాగేష్ తల్లి గొర్లి బజారమ్మ అలియాస్ అంజినమ్మ (85) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి.. నాగేష్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. ఎమ్మెల్యే తరుపున వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ బెట్టన గౌడలు గ్రామానికి చేరుకుని అంజినమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. నాగేష్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కందుకూరు తాయన్న, దుద్ది రామలింగ ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



కానిస్టేబుల్ శ్రీనివాసులు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కోర్టు రోడ్డులో నాయీ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సీతారామాంజనేయ స్వామి గుడి పునర్నిర్మాణానికి కర్నూలుకు చెందిన కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసులు రూ.1,01,116లు విరాళం ఇచ్చారు. ఈ మేరకు విరాళాన్ని నాయీబ్రాహ్మణ సేవాసంఘ అధ్యక్షుడు నర్సయ్యకు మంగళవారం స్థానిక ఆలయంలో అందజేశారు. ఇందులో భాగంగా శ్రీనివాసులు దంపతులతో పాటు సహకారం అందించిన అన్వర్‌బాషా, నరసింహులు, రంగన్నలను సంఘ నాయకులు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యల్లప్ప, ముగతి రామకృష్ణ, మల్లేష్, నాగన్న, బతకన్న, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీలను నియంత్రించండి



ఎస్‌కేడీ కాలనీలో పైపులైన్ లీకేజీలపై అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: పట్టణంలో ఏ వార్డులోనైనా పైపులైన్లకు లీకేజీలు అయితే తక్షణమే మరమ్మతు పనులు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో శానిటేషన్, పైపులైన్ లీకేజీలపై తనిఖీ చేశారు. పైపులైన్ లీకేజీ వల్ల వేలాది రూపాయలు ఖర్చు చేసి ఫిల్టర్ చేసిన తాగునీరు వృథా అవుతుందన్నారు. తద్వారా ప్రజల అవసరం మేరకు నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఏ వీధిలోనైనా, వార్డులోనైనా, సందుల్లోనైనా పైపులైన్ లీకేజీలు అయిన విషయం తెలుసుకున్న వెంటనే మరమ్మతు పనులు చేసి లీకేజీ అరికట్టాలని సూచించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని హెచ్చరించారు.

ఒప్పంద జీఓలను విడుదల చేయాలి



డాక్టర్ మనోజ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

కోసిగి: ఆశావర్కర్ల సమస్యల పై కుటుంబ సంక్షేమ అధికారులు యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందంపై జీవోలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షకార్యదర్శులు రాముడు, వీరేష్ కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వం హాస్పిటల్‌లో ఆశా డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు నిరసన తెలిపి డాక్టర్ మనోజ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఒప్పందం కుదిరి 9నెలల కావస్తున్నా ఇంతవరకు జీవోలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటి వరకు చాల మంది ఆశావర్కర్లును రిటైర్డ్ చేశారని, 60 నుంచి 62 ఏళ్ల వరకు పెంపుదల జీఓ రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశావర్కర్లు వెంకటమ్మ, సుజాత, శ్రీదేవి, బసవలింగమ్మ, రాధమ్మ, భారతి, ఈరమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షులు తిప్పన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీవోస్ కార్యాలయం వద్ద డీహెచ్‌ఎంఓకు వినతి పత్రం అందజేశారు. అలాగే మండలంలోని పెద్దతుంబళం మెడికల్ ఆఫీసర్‌కు మండల నాయకులు తిక్కప్ప, ఆశావర్కర్లు, యూనియన్ మండల కార్యదర్శి రాజేశ్వరి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు నాగమ్మ, లత, త్రివేణి, గిరిజా బాయి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



నాగలదిన్నెలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం : అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో తుంగభద్ర నదిలోని ఇసుక రీచ్‌ను తహసీల్దార్ పరిశీలించారు. ముందుగా చిన్నకొత్తిలి గ్రామంలో రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి వివిధ రకాల భూ సమస్యలపై అర్జీలను అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ..ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రావాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రభుత్వ అనుమతులతో నియమ నిబంధనల మేరకే ఇసుకను తరలించాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ మహేష్, ఆర్ఐ జెర్మియా, మండల సర్వేయర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్

ఆదోనిటౌన్: ప్రజలకు ఆశావర్కర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ ఆదేశించారు. మంగళవారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మలేరియా అధికారి నూకరాజు ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు ఆశాడే సందర్భంగా సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ దోమలు అభివృద్ధి చెందకుండా ఫ్రైడే-డ్రై డే చేపట్టాలన్నారు. మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాలు వందశాతం పూర్తి చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య విద్య అందించాలన్నారు.

కొత్త ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జాం



ఆదోని టౌన్: పట్టణంలోని మేదరగేరి ఫ్లై ఓవర్ బ్రిడ్జి, మార్కెట్‌యార్డు రోడ్, డీఎస్పీ బంగ్లా రోడ్డులో మంగళవారం ట్రాఫిక్ జాం కావడంతో ప్రజలు కష్టాలను ఎదుర్కొన్నారు. మంగళవారం కొత్త ఓవర్ బ్రిడ్జిపై ఓ పక్క గుంతలకు మరమ్మతులు చేస్తుండడంతో మరో పక్క మార్కెట్‌యార్డుకు తరలించే పత్తి, వేరుశనగ, ఆముదాలు తదితర సరుకులతో వెళ్లే లారీలు, ఆటోలు, మినీ లారీలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది. బ్రిడ్జిపై రాకపోకలు నిర్వహించేందుకు కూడా కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జి వద్దకు చేరుకున్నా ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

క్రమశిక్షణతో మంచి ఫలితాలు



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఎమ్మిగనూరుటౌన్: క్రమశిక్షణతో కూడిన చదువులతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలరని స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా సూచించారు. మంగళవారం కళాశాలలో ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి, ముగతి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, మంత్రాలయం కళాశాల అధ్యాపకులు మల్లన్న, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, క్రాంతికుమార్ పాల్గొని ప్రసంగించారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నందవరం ఆసుపత్రిలో డాక్టర్ శ్రీలేఖకు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

నందవరం : రాష్ట్రంలో 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని 104 డీఈఓ వంశీ, డ్రైవర్ నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీలేఖకు 104 ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..104 ద్వారా పల్లెల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు జీతాలు చెల్లించే అరబిందో సంస్థకు బిల్లులు చెల్లించి ఆదుకోవాలన్నారు. గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే 104 ఉద్యోగులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

104 ఉద్యోగుల జీతాలు చెల్లించండి

కోసిగి : 104 ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని ఆ సంఘం నాయకులు వెంకటేష్, రామాంజినేయులు, సురేష్, విజయ్ కోరారు. మంగళవారం కోసిగి, కందుకూరు పీహెచ్‌సీల ఎదురుగా 104 ఉద్యోగులు నిరసనలు తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని డాక్టర్ మనోజ్‌కుమార్‌కు సమర్పించారు.

రోడ్ల మరమ్మతుకు చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: శిథిలమైన రోడ్లకు మరమ్మతు పనులు సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని శివసర్కిల్ నుంచి ర్యాలీగా బయలు దేరి కర్నూలు బైపాస్ రోడ్డు వద్ద మరమ్మతు పనులను ప్రారంభించారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగుల సంఖ్యను ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. పాఠకుల సంఖ్య మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

పెద్దకడబూరు : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 1వ సచివాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏ గ్రామంలోని సమస్యలు ఆ గ్రామంలోనే పరిష్కరించుకునే విధంగా సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సచివాలయ సిబ్బంది వారు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సచివాలయాలకు ఎప్పుడు వెళ్లినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు.

రైతులను మోసగిస్తే సహించేది లేదు



వేరుశనగకాయలను పాసింగ్ చేస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్

ఆదోని అర్బన్: రైతులపై అధిక చార్జీలు వేసి మోసగిస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే పార్థసారథి, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రైతు, విశ్రాంతి భవనం, వేబ్రిడ్జ్ కాటా, వాటర్ స్పెషలిటీని తనిఖీ చేశారు. అదేవిధంగా పత్తి, వేరుశనగ మార్కెట్‌లో రైతుల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యార్డు సెక్రటరీ ఛాంబర్‌లో సబ్‌కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. వర్షం వస్తే మార్కెట్‌యార్డులో వేరుశనగకాయలు తడిసిపోయి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవడమేగాకుండా నష్టపోతున్నారన్నారు. ఇందుకు ఏమి చర్యలు తీసుకుంటున్నారని అధికారులను ప్రశ్నించారు. సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, డీఈ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం మొత్తం రూ.1.38 కోట్లతో గత నెలలోనే కమిషనర్‌కు ప్రపోజల్ పెట్టామని తెలిపారు. త్వరితగతిన టెండర్ చేపట్టి పనులు ప్రారంభించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా రైతుల కోసం విశ్రాంతి భవనాన్ని మరమ్మతులు చేయాలని, రైతుల కోసం ఇద్దరు డాక్టర్లను ఏర్పాటు షిఫ్ట్ పద్ధతిలో ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు.

పాసింగ్ చేయకుండా చర్యలు చేపట్టండి

వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఎమ్మిగనూరులో ఉన్న విధానంలా వేరుశనగకాయలకు పాసింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డులో అయితే టెండర్ అయిన వెంటనే రాళ్లు, రప్పలు, మట్టి తీయకుండా, పాసింగ్ చేయకుండా సంచుల్లో కాటా వేస్తారన్నారు. ఆదోనిలో మాత్రం అన్నీ తీసి పాసింగ్ చేసి ధరలను మాత్రం ఎమ్మిగనూరులో ఉండేవే ఉంటాయని, అలా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

ఆదోని అర్బన్: పీఎం సూర్య ఘర్ సోలార్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి, ప్రతి ఇంట్లో సోలార్ పెట్టుకునేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక డీఈ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పట్టణం, గ్రామాల్లో సోలార్‌పై రూ.78 వేలు సబ్సిడీ వస్తుందని, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లల్లో పెట్టుకుంటే విద్యుత్ ఆదా కావడమేగాకుండా విద్యుతను అమ్ముకోవచ్చన్నారు. సమావేశంలో ఎస్ఏఓ రాఘవులు, డీఈ రాజేష్, ఏడీలు పురుషోత్తం, సంతోష్, ఖాజావలి, కర్నూలు కన్‌స్ట్రక్షన్ ఏడీ యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పెద్దకడబూరు : మండల పరిధిలోని రంగాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. రంగాపురం గ్రామం సమీపంలోని కొండలో 11మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి చేయగా వారిలో ఇద్దరు మాత్రమే దొరికారన్నారు. మిగిలిన 9మంది పారిపోయారని, మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసి వారి నుంచి రూ. 20,200లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామానికి చెందిన బోయ వెంకన్నతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలోని గ్యాస్ గోడౌన్ వద్ద ఉన్న కుక్కను తోలమని అటుగా వెళ్తున్న చాకలి నరసింహులును ఆ ముగ్గురు సూచించారు. ఆయన నేను తోలను నన్ను కరుస్తుందని చెప్పడంతో మాకే ఎదరు చెప్తుతావా అంటూ దాడి చేశారు. చాకలి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యంతో ఎస్ఐ విజయకుమార్

మంత్రాలయం : మండల పరిధిలోని మాధవరం సంత మార్కెట్ సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం గిలకసూగూరు క్యాంప్ గ్రామానికి చెందిన నాగేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 288 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు తీసుకెళ్తూ పట్టుబడ్డారన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

నాటుసారా విక్రేత అరెస్టు

ఆదోని రూరల్: మండలంలోని బసాపురం గ్రామానికి చెందిన పెద్ద పార్వతి అనే మహిళ తన ఇంటి వద్ద నాటుసారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఇస్పీ ఎస్ఐ నాగేంద్ర మంగళవారం తెలిపారు. సదరు మహిళ వద్ద నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



కంది పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అశోక్‌కుమార్ రెడ్డి

ఆదోని రూరల్: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారి సి.అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పర్వతాపురం, చిన్నహరివాణం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్వతాపురం గ్రామంలో పత్తి పంటలో గులాబీ రంగు పురుగును గమనించి, సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. 5 శాతం వేపగింజల ద్రావణం, క్లోరంట్రానిలిప్రోల్ 18.5శాతం, ట్రేసర్ 70 మి.లీ. లేదా థియాక్లోప్రిడ్ 21.7 ఎస్‌సీ 120 మి.లీ. ఎరాకు 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా చిన్నహరివాణంలో మిరప పంటలో తామర పురుగులు, పచ్చదోమ, తెల్లదోమ ఉధృతిని గుర్తించారు. నివారణకు ఫ్లక్సామెటమైడ్ 10 శాతం డబ్ల్యూ/డబ్ల్యూ ఈసీ 160 మి.లీ. ఎకరాకు, బ్రోఫ్లానిలైడ్ 300 జీ/ఎల్ ఎస్సీ 34 మి.లీ. ఎకరాకు 200 లీటర్ల నీటితో పిచికారీ చేయాలన్నారు.